

Registered No : APTEL/25/A0818

ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక



ఆదివారం 22-11-2026 | పేజీలు :4 | వెల :2 | సంపుటి :02 | సంచిక :153 | www.edhikadhanijam.com | ఎడిటర్ : బాలరాజు గౌడ్

బియ్యం ధరలకు సర్కార్ కళ్లెం!

- కిలో ధర రూ.47 నుంచి రూ.82 వరకు
- అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు
- మిల్లర్లు, డీలర్లకు కొత్త నిబంధనలు
- ప్రతి శుక్రవారం నిల్వల వివరాలు అప్‌డేట్
- గోదాములు, వాహనాల్లో తనిఖీలకు ఆదేశాలు
- అక్రమ నిల్వలు, కృత్రిమ కొరతపై నిఘా
- నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు



న్యూస్ డెస్క్, 21 నవంబర్ (ఇది కద నిజం): ఆంధ్రప్రదేశ్‌లో బియ్యం నిల్వలు, ధరలను నియంత్రించేందుకు ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. బియ్యం ధరలు అధికంగా పెంచి విక్రయించకుండా, అక్రమ నిల్వలకు అడ్డుకట్ట వేసేందుకు కొత్త ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార మరియు ప్రజాపంపిణీ శాఖ జారీ చేసిన అనుమతి మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఈ ఆదేశాలు వెలువరించింది. బియ్యం రకాలను బట్టి కిలో ధరలను రూ.47 నుంచి రూ.82 వరకు నిర్ణయించింది. వివిధ రకాల బియ్యాన్ని విక్రయించే వ్యాపారులు నిర్ణయించిన ధరల పరిమితులను పాటించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. బియ్యం రకాలను బట్టి కిలోకు కనిష్ఠంగా రూ.47 నుంచి గరిష్ఠంగా రూ.82 వరకు ధరలు నిర్ణయించింది. ఈ ధరలకు మించి విక్రయాలు జరిపితే సంబంధిత వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

2 లో

ఉగ్రవాద రహిత కశ్మీర్.. అమిత్ షా ప్రకటన!

- 35 ఏళ్ల తర్వాత ఉగ్రవాద రహిత కశ్మీర్
- చివరి స్థానిక ఉగ్రవాది లతీఫ్ భట్ హతం
- కశ్మీర్‌లో ఉగ్రవాదులకు చోటు లేదన్న అమిత్ షా
- ఉగ్రవాదంపై పోరులో కీలక మైలురాయి
- ఉగ్రవాద నెట్‌వర్క్‌ను పూర్తిగా కూల్చివేయడమే లక్ష్యం
- కేంద్రం, రాష్ట్రాల మధ్య సమన్వయానికి పిలుపు
- దేశవ్యాప్తంగా ఉగ్రవాద నిరోధక వ్యవస్థ బలోపేతం

2 లో

అలిగితే కఠిన చర్యలు.. చంద్రబాబు హెచ్చరిక!

- ఆదినారాయణరెడ్డి తీరుపై చంద్రబాబు అసంతృప్తి
- పదవుల కోసం అలకలేంటని ప్రశ్న
- అలిగిన నేతలకు చంద్రబాబు వార్నింగ్
- వినకపోతే కఠిన చర్యలంటూ హెచ్చరిక
- జడ్పీ ఛైర్మన్ పదవిపై వివాదం
- 20 నిమిషాల్లో రాజకీయాలు మారుస్తానన్న ఆది
- రాజీనామాకు సిద్ధమంటూ సంచలన ప్రకటన

2 లో

మళ్లీ కరోనా కలకలం.. 18 దేశాల్లో వైరస్ వ్యాప్తి



2 లో

న్యూస్ డెస్క్, 21 నవంబర్ (ఇది కద నిజం): దేశంలో మరోసారి కరోనా కలకలం రేపుతోంది. నవంబర్ 8 నాటికి 18 దేశాల్లో కొత్త వేరియంట్ వ్యాప్తి ఉన్నట్టు ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తించింది. జేఎన్ 1 ఫ్యామిలీకి చెందిన పీజే 2.1 అనే కొత్త వేరియంట్‌ను డబ్ల్యూహెచ్ఓ పర్యవేక్షణలో ఉన్న వేరియంట్‌లలో చేర్చింది. కెనడా, అమెరికా లాంటి దేశాల్లో ఈ కేసులు ఎక్కువగా నమోదవుతున్నట్టు స్పష్టం చేసింది.

రాజగోపాల్‌కు ఢిల్లీ నుంచి పిలుపు!



- నవంబర్ 23న బీఎం సందీప్‌తో భేటీ
- రాష్ట్ర రాజకీయాలపై హైకమాండ్ ఆరా
- సీఎం తీరుపై రాజగోపాల్ అసంతృప్తి
- మంత్రి పదవిపై రాజకీయ ఉత్కంఠ
- గాంధీభవన్‌లో కీలక సమావేశాలు
- పార్టీ మార్పుపై రాజగోపాల్ స్పష్టత

2 లో

గులాబీ జోరు కాంగ్రెస్ బేజారు!



న్యూస్ డెస్క్, 21 నవంబర్ (ఇది కద నిజం): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పని అయిపోయిందని, త్వరలోనే మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి రాబోతోందని ఆ పార్టీ నేతలు ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్‌లో ప్రతిరోజూ జరుగుతున్న భారీ చేరికలే ఇందుకు నిదర్శనమని వారు పేర్కొన్నారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను హైకోర్టు అనర్హుడిగా ప్రకటించడంతో రాష్ట్రంలో ఉప ఎన్నికలు రావడం ఖాయమని, ఏ సంస్థ, ఏ పార్టీ సర్వే నిర్వహించినా రాష్ట్రంలో మళ్లీ కేసీఆర్ ప్రభుత్వమే వస్తుందని తేలుతోందని బీఆర్ఎస్ నేతలు వ్యాఖ్యానించారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తాము విమర్శలు చేయాల్సిన అవసరమే లేదని, సొంత కాంగ్రెస్ ఎమ్మెల్యేలే ఆయనను తీవ్ర స్థాయిలో విమర్శిస్తున్నారని బీఆర్ఎస్ నేతలు ఎద్దేవా చేశారు.

మిగతాది 2 లో..

- కాంగ్రెస్‌పై కౌంట్‌డౌన్ మొదలైంది!
- మళ్లీ కేసీఆర్ శకమే.. హరీష్ ధీమా!
- కాంగ్రెస్ పాలనపై సొంత ఎమ్మెల్యేల తిరుగుబాటు!
- హైదరాబాద్ బ్రాండ్‌కు కాంగ్రెస్ దెబ్బ!
- తాగునీరు, కరెంట్ కష్టాలతో నగరం విలవిల!
- పరిశ్రమలు, శాంతిభద్రతల్లో సర్కార్ ఫెయిల్!
- వైద్యం, విద్య.. సంక్షేమానికి గ్రహణం!
- హామీలన్నీ హుష్.. ప్రజలకు నిరాశే మిగులు!
- బడే భాయ్-చోటే భాయ్.. తెలంగాణకు అన్యాయం!

వరంగల్‌కు మెగా సిటీ హంగులు!

- రూ.20 వేల కోట్లతో అభివృద్ధి పనులు
- భూగర్భ డ్రైనేజీకి ప్రత్యేక ప్రణాళిక
- వరంగల్ కోట కందకం పునరుద్ధరణ
- హనుమకొండలో బిజినెస్ డిస్ట్రిక్ట్
- వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి
- మురుగునీటి పునర్వినియోగానికి ప్రణాళిక
- ప్రాజెక్టులపై సీఎం రేవంత్ సమీక్ష



2 లో

న్యూస్ డెస్క్, 21 నవంబర్ (ఇది కద నిజం): రాష్ట్రంలో పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి పురపాలక శాఖ రూపొందించిన ప్రతిపాదనలపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సమీక్షించారు. వాతావరణ మార్పులను తట్టుకునేలా, పర్యావరణ పరిరక్షణకు దోహదపడేలా పట్టణాలను అభివృద్ధి చేసే ప్రణాళికలపై చర్చించారు. ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ), ఆసియా మౌలిక సదుపాయాల పెట్టుబడుల బ్యాంకు (ఏఐఐబీ), జర్మనీకి చెందిన కేఎఫ్‌డబ్ల్యూ బ్యాంకుతో పాటు దేశీయ ఆర్థిక సంస్థల సహకారంతో దాదాపు రూ.20 వేల కోట్ల విలువైన ప్రాజెక్టులను చేపట్టేందుకు పురపాలక శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసింది.

ఒవైసీపై రేవంత్ ఎటాక్.. వెనుక వ్యూహం ఇదేనా?

- ఒవైసీపై రేవంత్ ఫైర్
- యూపీ కూటమితో కాంగ్రెస్ కలవరం?
- మైనారిటీ ఓట్లపై ఆందోళన
- హైకమాండ్‌కు సంకేతాలా?
- కాంగ్రెస్--ఎంఐఎం సఖ్యతకు పరీక్ష
- జీహెచ్ఎంసీలో దోస్తీ ఉంటుందా?
- రేవంత్ వ్యాఖ్యల వెనుక వ్యూహం?



2 లో

న్యూస్ డెస్క్, 21 నవంబర్ (ఇది కద నిజం): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఎంఐఎంతో సఖ్యతగా వ్యవహరిస్తూ వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి.. ఒక్కసారిగా ఆ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీని టార్గెట్ చేయడం రాజకీయంగా ఆసక్తికర పరిణామంగా మారింది. ప్రధాని మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో పాటు ఒవైసీ కూడా హిందూ, ముస్లిం ఓట్ల కోసమే రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. అమిత్ షాకు నిజంగా ఎంఐఎంపై అంత వ్యతిరేకత ఉంటే.. హైదరాబాద్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసి ఒవైసీని ఓడించాలని సవాల్ విసిరారు.

కంపెనీలను తెచ్చేది గూండాయిజంతోనా?



2 లో

- మెటా కార్యాలయంపై దాడిని ఖండించిన కేటీఆర్
- బ్రాండ్ హైదరాబాద్‌ను దెబ్బ తీశారంటూ ఫైర్
- కాంగ్రెస్ గూండాయిజంపై కేటీఆర్ ఆగ్రహం
- రాహుల్ గాంధీకి కేటీఆర్ సూటి ప్రశ్న
- మూడేళ్లలో ఒక్క కంపెనీ తెచ్చారా?
- మెటా క్యాంపస్ భద్రతపై ఆందోళన
- హైదరాబాద్‌పై నమ్మకం దెబ్బతిందంటూ విమర్శ

భారత్‌ను సైడ్ ప్లేయర్‌గా మార్చారు!

- విదేశాంగ విధానంపై రాహుల్ విమర్శలు
- భారత్ సైడ్ ప్లేయర్‌గా మారిందంటూ వ్యాఖ్య
- మోడీపై రాహుల్ ఘాటు ఆరోపణలు
- పాక్ ఉగ్రవాదం ఆపితేనే చర్చలు
- రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ ఫైర్
- పాక్ అభిమాని అంటూ కౌంటర్
- విదేశీ వేదికపై రాహుల్ వ్యాఖ్యల దుమారం



2 లో

న్యూస్ డెస్క్, 21 నవంబర్ (ఇది కద నిజం): అమెరికాలోని చికాగో విశ్వవిద్యాలయంలో విద్యార్థులు, ప్రొఫెసర్ రాబర్ట్ పేప్‌తో జరిగిన సంభాషణలో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వ విదేశాంగ విధానంపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రపంచ వ్యవహారాల్లో స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునే స్థాయి నుండి భారత్ వెనక్కి తగ్గి ఇప్పుడు ఒక 'సైడ్ ప్లేయర్' గా మిగిలిపోయిందని, ఒకవేళ దేశంలో కాంగ్రెస్ అధికారంలో ఉండి ఉంటే, ట్రంప్, పుతిన్, జీ జిన్‌పింగ్ వంటి అగ్రనేతలతో పాటు మన ప్రధాని కూడా కీలక వేదికలపై సమఉజ్జీగా కూర్చునేవారని వ్యాఖ్యానించారు. ప్రధాని నరేంద్ర మోడీ విదేశీ శక్తులకు తలొగ్గుతున్నారని, డొనాల్డ్ ట్రంప్, వ్లాదిమిర్ పుతిన్ వంటి నేతలతో 'వ్యక్తిగత స్నేహం' ఉందన్న భ్రమలో ఉన్నారే తప్ప, భౌగోళిక రాజకీయాలు వ్యక్తిగత స్నేహాలతో నడవవని, దేశ ప్రయోజనాలను కేంద్రం తాకట్టు పెడుతోందని తీవ్ర ఆరోపణలు చేశారు. అమెరికా, ఇరాన్‌లతో పాకిస్తాన్ చర్చలు జరుపుతుంటే భారత్ కేవలం చూస్తూ ఉండిపోవడం ఆశ్చర్యకరంగా ఉందని, గతంలో అలీన ఉద్యమానికి నాయకత్వం వహించిన స్థాయిని మనం తిరిగి అందుకోవాలని రాహుల్ గాంధీ అభిప్రాయపడ్డారు. అంతేకాకుండా, ఆర్ఎస్ఎస్, బీజేపీ కలిసి దేశంలో ఆర్థిక, రాజకీయ శక్తిని కేంద్రీకరిస్తున్నాయని, 2014 తర్వాత బీజేపీ ఆర్థిక వ్యవస్థ అదానీ సంస్థతో కలిసిపోయి గుత్తాధిపత్యం సృష్టించిందని ఆరోపించారు. ఎన్నికల వ్యవస్థలో లోపాల వల్లే ఈ పరిస్థితి వచ్చిందని, తనను భారతీయ విశ్వవిద్యాలయాలలోకి వెళ్లకుండా అడ్డుకుంటున్నారని విమర్శించారు.

తెలంగాణలో బీజేపీ ఆట షురూ.. కిషన్ రెడ్డి వార్నింగ్!

- రేవంత్‌కు కిషన్ రెడ్డి గట్టి కౌంటర్
- తెలంగాణలో బీజేపీ ఆట షురూ
- 8 ఎంపీ సీట్లపై కిషన్ రెడ్డి వ్యాఖ్య
- రెండు ఎమ్మెల్సీలు బీజేపీ ఖాతాలోనే
- కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై ఘాటు విమర్శలు
- ప్రజలు మార్పును కోరుకుంటున్నారన్న కిషన్
- రాబోయే ఎన్నికల్లో కమలం వికసిస్తుందా?

2 లో

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
ఆదివారం 21-11-2026

ఒవైసీపై రేవంత్ ఎటాక్.. వెనుక వ్యూహం ఇదేనా?

మొదటి పేజీ తరువాయి

అయితే ఇప్పటివరకు స్నేహపూర్వకంగా ఉన్న ఒవైసీపై రేవంత్ ఒక్కసారిగా విమర్శల దాడి చేయడం వెనుక అసలు వ్యూహం ఏమిటన్న చర్చ ఇప్పుడు రాష్ట్రంతో పాటు జాతీయ రాజకీయాల్లోనూ మొదలైంది.

యూపీ పొత్తే అసలు కారణమా?

ఉత్తరప్రదేశ్‌లో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఒవైసీ తీసుకున్న నిర్ణయమే రేవంత్ వైఖరిలో మార్పునకు కారణమై ఉండొచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. యూపీలో ఎన్డీయే, ఇండియా కూటమి మధ్య గట్టి పోటీ నెలకొంటుందనే అంచనాల వేళ.. అసదుద్దీన్ ఒవైసీ, ఆజాద్ సమాజ్ పార్టీ అధినేత చంద్రశేఖర్ ఆజాద్‌తో కలిసి 'సామాజిక్ పరివర్తన్ మోర్చా' పేరుతో కొత్త కూటమిని తెరపైకి తీసుకొచ్చారు. రాష్ట్రంలోని మొత్తం 403 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేయాలని నిర్ణయించారు. ఈ పరిణామం కాంగ్రెస్ జాతీయ నాయకత్వానికి ఇబ్బందికరంగా మారినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. ముఖ్యంగా మైనారిటీ ఓట్లు చీలిపోవడం వల్ల బీజేపీకి పరోక్షంగా లబ్ధి చేకూరుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ఒవైసీ రాజకీయాలపై రేవంత్ బహిరంగంగా విమర్శలు గుప్పించారా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

హైకమాండ్‌కు సంకేతాలు పంపేందుకేనా?

తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎంఐఎంతో సఖ్యత కొనసాగుతోంది. అసెంబ్లీలో ఆ పార్టీకి చెందిన ఏడుగురు ఎమ్మెల్యేలు పలు సందర్భాల్లో ప్రభుత్వానికి మద్దతుగా నిలుస్తువస్తున్నారు. 2024లో సీఎం రేవంత్ రెడ్డి యూకే పర్యటనకు వెళ్లినప్పుడు ఒవైసీ సోదరుడు, ఎమ్మెల్యే అక్బరుద్దీన్ కూడా ఆయనతో కలిసి వెళ్లారు. దీంతో కాంగ్రెస్, ఎంఐఎం మధ్య రాజకీయ అవగాహన ఉందనే చర్చలు అప్పట్లో బలంగా వినిపించాయి. అయితే యూపీలో ఒవైసీ కొత్త కూటమి ఏర్పాటు చేసి ఎన్నికల బరిలోకి దిగడం కాంగ్రెస్ అధిష్ఠానానికి అసంతృప్తి కలిగించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో తెలంగాణలో ఎంఐఎంతో తమ సంబంధాలు కేవలం అంశాల ఆధారంగానే ఉంటాయని, పార్టీ ప్రయోజనాల విషయంలో ఎలాంటి రాజీ ఉండదని ఢిల్లీ పెద్దలకు స్పష్టం చేయాలనే ఉద్దేశంతోనే రేవంత్ ఈ వ్యాఖ్యలు చేశారా? అనే చర్చ జరుగుతోంది. రాష్ట్రంలో ఎంఐఎంతో ఉన్న రాజకీయ సాన్నిహిత్యాన్ని జాతీయ స్థాయిలో కాంగ్రెస్‌కు ఇబ్బందిగా మారనివ్వకూడదన్న వ్యూహం కూడా ఇందులో ఉండొచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

జీహెచ్ఎంసీ ఎన్నికల్లో దోస్తీ ఉంటుందా?

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణలో రాజకీయ సమీకరణాలు మారుతూ వస్తున్నాయి. గతంలో బీఆర్ఎస్‌కు దగ్గరగా ఉన్న ఎంఐఎం.. ఇప్పుడు పలు సందర్భాల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతుగా నిలుస్తోంది. మరోవైపు బీఆర్ఎస్‌పై కూడా విమర్శలు గుప్పిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో రేవంత్ తాజా వ్యాఖ్యలు కేవలం జాతీయ రాజకీయాలకు పరిమితమవుతాయా? లేక రాష్ట్రంలోనూ కాంగ్రెస్, ఎంఐఎం మధ్య సంబంధాలపై ప్రభావం చూపుతాయా? అన్నది ఆసక్తికరంగా మారింది. ముఖ్యంగా రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికలు ఈ రెండు పార్టీల రాజకీయ సంబంధాలకు కీలక పరీక్షగా మారే అవకాశం ఉంది. ఇప్పటివరకు కొనసాగిన సఖ్యత ఎన్నికల నాటికీ ఉంటుందా? లేక కాంగ్రెస్ ఒంటరిగానే బరిలోకి దిగుతుందా? అన్నది చూడాలి. మొత్తంగా ఒవైసీపై రేవంత్ చేసిన తాజా వ్యాఖ్యలు రాజకీయ విమర్శలకే పరిమితమా? లేక తెలంగాణతో పాటు జాతీయ స్థాయిలోనూ కొత్త రాజకీయ వ్యూహానికి సంకేతమా? అనేది రానున్న పరిణామాలే తేల్చనున్నాయి.

రాజగోపాల్‌కు ఢిల్లీ నుంచి పిలుపు!

న్యూస్ డెస్క్, 21 నవంబర్ (ఇది కద నిజం): తెలంగాణ కాంగ్రెస్ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి ఢిల్లీ అధిష్టానం నుంచి కీలక ఆదేశాలు అందాయి. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల కొత్త ఇన్‌ఛార్జ్‌గా నియమితులైన బీఎం సందీప్‌తో నవంబర్ 23వ తేదీన సమావేశం కావాలని హైకమాండ్ సూచించింది. ఈ మేరకు ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ స్వయంగా రాజగోపాల్ రెడ్డికి ఫోన్ చేసి రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిణామాలపై ఆరా తీస్తూ, సందీప్‌తో భేటీకి అందుబాటులో ఉండాలని కోరారు.

మంత్రి పదవిపై ఉత్కంఠ వేళ కీలక సమావేశం

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి పనితీరుపై రాజగోపాల్ రెడ్డి బహిరంగంగానే తీవ్ర విమర్శలు చేస్తున్న నేపథ్యంలో ఆయనకు మంత్రి పదవి దక్కడం కష్టమేనని పార్టీ వర్గాల్లో మరియు రాష్ట్ర రాజకీయాల్లో జోరుగా చర్చ సాగుతోంది. ఈ వివాదాల నడుమ ఆదివారం (నవంబర్ 22) హైదరాబాద్‌కు వస్తున్న బీఎం సందీప్, గాంధీభవన్‌లో జరిగే పీఏసీ (పొలిటికల్ అఫైర్స్ కమిటీ), విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశాల్లో పాల్గొననున్నారు. మరుసటి రోజైన సోమవారం (నవంబర్ 23) సందీప్‌తో జరగనున్న భేటీలో తాను ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ప్రభుత్వ తీరుపై ఉన్న అసంతృప్తిని ఆయన దృష్టికి తీసుకెళ్లనున్నట్లు రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. మరోవైపు తాను పార్టీ మారే ఆలోచనలో లేనని, రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే తన లక్ష్యమని ఆయన తేల్చి చెప్పారు.

రెండు స్థానాలు.. రెండు పార్టీల వ్యూహం!

మొదటి పేజీ తరువాయి

అందుకని గులాబీ, కమలం నేతలు ఓ ప్లాన్ ప్రకారం గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను ఓడించేందుకు ఇప్పటి నుంచే వ్యూహరచన చేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతున్నది.

బరిలోకి డమ్మీ అభ్యర్థులు?

రెండు స్థానాల్లో కాంగ్రెస్‌ను ఓడించి, చేరో స్థానంలో గెలవాలని ప్లాన్‌తో ఇరు పార్టీల మధ్య సంప్రదింపులు కొనసాగుతున్నట్లు అటు కమలం, ఇటు గులాబీ పార్టీ వర్గాల్లో సైతం డిస్కషన్ జరుగుతున్నది. రెండు స్థానాలకు అధికారికంగా అభ్యర్థులను ప్రకటిస్తారు. కానీ ఒక స్థానంలో మాత్రం డమ్మీ అభ్యర్థిని బరిలోకి దింపేందుకు ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తున్నది. ఖమ్మం-నల్గొండ-వరంగల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ తరుపున పోటీ చేస్తున్న అభ్యర్థి గెలుపు కోసం బీజేపీ కేడర్ పనిచేసే విధంగా, మహబూబ్‌నగర్ -రంగారెడ్డి-హైదరాబాద్ స్థానంలో బీజేపీ అభ్యర్థి గెలుపు కోసం గులాబీ కేడర్ పనిచేసేవిధంగా అవగాహన కుదుర్చుకునే ప్రయత్నాలు కొనసాగుతున్నట్లు ప్రచారం ఉంది. అందుకే ఇంతవరకు ఆ రెండు పార్టీలు తమ అభ్యర్థులను ప్రకటించలేదు. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ నుంచి బీజేపీ అభ్యర్థిగా ఆ పార్టీ అధ్యక్షుడు రాంచందర్ రావును పోటీ చేయించే అవకాశం ఉన్నట్టు తెలుస్తున్నది. అలాగే ఖమ్మం-నల్గొండ-వరంగల్ స్థానం నుంచి బీఆర్ఎస్ తరుపున రాకేశ్ రెడ్డిని బరిలోకి దించేందుకు సిద్ధమైన గులాబీ పార్టీ క్షేత్ర స్థాయిలో ఓటు నమోదు కొనసాగిస్తున్నది. అయితే డమ్మీ అభ్యర్థిగా ఎవరిని బరిలోకి దించాలనే అంశంపైనే రెండు పార్టీల మధ్య తుది నిర్ణయం జరగలేదని, అందుకే అభ్యర్థుల ప్రకటనలో ఆలస్యం జరుగుతుందని చర్చ ఇరు పార్టీల కేడర్‌లో ఉంది.

తెలంగాణలో బీజేపీ ఆట షురూ.. కిషన్ రెడ్డి వార్నింగ్!



న్యూస్ డెస్క్, 21 నవంబర్ (ఇది కద నిజం): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి గట్టి కౌంటర్ ఇచ్చారు. తెలంగాణలో ఇకపై బీజేపీ ఆట మొదలవుతుందని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రజలు మార్పును కోరుకుంటున్నారని, ఆ మార్పు కేవలం బీజేపీతోనే సాధ్యమవుతుందని ధీమా వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ కిషన్ రెడ్డి తీవ్ర స్థాయిల్లో విమర్శలు గుప్పించారు. "రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాతే రాష్ట్రంలో బీజేపీ 8 ఎంపీ సీట్లను గెలుచుకుంది. అంతేకాకుండా, ఇటీవల జరిగిన రెండు ఎమ్మెల్సీ స్థానాల్లోనూ బీజేపీనే విజయం సాధించింది. రాబోయే మరో రెండు ఎమ్మెల్సీ స్థానాలు కూడా బీజేపీ ఖాతాలోనే పడతాయి" అని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల తీరును ప్రజలు పూర్తిగా అసహ్యించుకుంటున్నారని కిషన్ రెడ్డి విమర్శించారు. రానున్న రోజుల్లో ఆ రెండు పార్టీలకు ప్రజలు ఓటు వేసే ప్రసక్తే లేదన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల ఆకాంక్షల నెరవేర్పు బీజేపీతోనే సాధ్యమని ప్రజలు నమ్ముతున్నారని, రాబోయే ఎన్నికల్లో కమలం వికసించడం ఖాయమని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

మళ్లీ కరోనా కలకలం.. 18 దేశాల్లో వైరస్ వ్యాప్తి

అయితే గతంలో వచ్చిన డేంజర్ వేరియంట్ల మాదిరిగా కాకుండా ఈ వేరియంట్ ముప్పు తక్కువగానే ఉండవచ్చని పేర్కొంది. కొత్త వేరియంట్‌కు సంబంధించిన తొలికేసు 2026 మే 2న కెనడాలోని ఒంటారియోలో నమోదైనట్లు తెలిపింది. ఇది క్రమంగా దేశంలోని ఇతర ప్రాంతాలకు వ్యాపించిందని, జూన్ 30న న్యూయార్క్‌లోనూ ఈ వేరియంట్ ను గుర్తించినట్లు తెలిపింది. ప్రస్తుతం ఈ వేరియంట్ కెనడా, అమెరికాతో పాటు స్పెయిన్, ఫ్రాన్స్, ఇజ్రాయెల్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, సింగపూర్ దేశాలలో విస్తరిస్తున్నట్లు తెలుస్తోంది.

అలిగితే కఠిన చర్యలు.. చంద్రబాబు హెచ్చరిక!



న్యూస్ డెస్క్, 21 నవంబర్ (ఇది కద నిజం): బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి తీరుపై సీఎం చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేశారు. జడ్పీ ఛైర్మన్ పదవి ఇవ్వలేదని అలగటం ఏంటని ప్రశ్నించారు. పదవుల కోసం అలకలు సరికాదన్నారు. టీడీపీలో మూడు చోట్ల అసంతృప్తి, అలకలు ఉన్నాయని చెప్పారు. అలిగినవారికి కౌన్సిలింగ్ ఇస్తామని, వినకపోతే కఠినంగా వ్యవహరిస్తామని వార్నింగ్ ఇచ్చారు. అందరినీ కలుపుకుని వెళ్లడమే నాయకుడి లక్షణం అంటూ వ్యాఖ్యానించారు. ఇక కడప జిల్లా జడ్పీ ఛైర్మన్ పదవి తన అన్న కుమారుడికి దక్కకపోవడంపై ఆదినారాయణ రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే.

పదవి బీజేపీకే ఇస్తామని చివరి 5నిమిషాల్లో మాట మార్చారని ఆదినారాయణ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమిలో చెప్పేది ఒకటి చేసేది మరొకటి అంటూ అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికే లోకేష్, చంద్రబాబుతో విడివిడిగా చర్చలు జరిగాయని కానీ చర్చల తరవాత కూడా తాను సంతృప్తి చెందలేదన్నారు. తాను తలుచుకుంటూ 20 నిమిషాల్లో రాజకీయసమీకరణాలు మారిపోతాయని హెచ్చరించారు. రాజీనామా చేసేందుకు కూడా తాను వెనకాడనని, ఢిల్లీలో హైకమాండ్‌కు పరిస్థితి వివరించిన తరవాత తన రాజీనామాపై ప్రకటన చేస్తానని తెలిపారు. ఇక ఇప్పుడు చంద్రబాబు అలకలపై చేసిన కామెంట్లతో ఆదినారాయణ రెడ్డి ఏం చేస్తారన్నది ఆసక్తికరంగా మారింది.

కంపెనీలను తెచ్చేది గూండాయిజంతోనా?

న్యూస్ డెస్క్, 21 నవంబర్ (ఇది కద నిజం): హైదరాబాద్ గచ్చిబౌలిలోని మెటా కార్యాలయంపై యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు చేసిన దాడిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనపై ఆయన 'ఎక్స్' వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వంపై, ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. దేశవ్యాప్తంగా లక్షలాది కుటుంబాలకు ఉపాధి కల్పిస్తున్న బ్రాండ్ హైదరాబాద్?ను ఎన్నో ఏళ్ల పాటు శ్రమించి, పరిశ్రమలకు అనుకూలమైన విధానాలతో ఎంతో కష్టపడి నిర్మించామని కేటీఆర్ గుర్తు చేశారు. నగరంలోని మెటా కార్యాలయాన్ని ధ్వంసం చేయడాన్ని కాంగ్రెస్ గూండాలు ఏదో గొప్ప పనిగా భావిస్తున్నారని, ఆ మూర్ఖులు దాని గురించి గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటని మండిపడ్డారు.

రాహుల్ ఇదేనా మీ విధానం?:

గడిచిన మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలోని మెటా లాంటి ఒక్క పెద్ద కంపెనీనైనా హైదరాబాద్‌కు తీసుకురాగలిగారా? అని కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు. రాహుల్ గాంధీని ట్యాగ్ చేస్తూ.. దేశంలోకి కంపెనీలను తీసుకొచ్చే మీ విధానం ఇదే విధమైన గూండాయిజమా? అని నిలదీశారు. భారత్‌లోనే మెటాకు అతిపెద్ద క్యాంపస్ హైదరాబాద్‌లో ఉందని, తాము సురక్షితమైన పని వాతావరణాన్ని కల్పిస్తామని హామీ ఇవ్వడం వల్లే ఆ సంస్థ మన నగరాన్ని ఎంచుకుందని కేటీఆర్ ట్వీట్?లో పేర్కొన్నారు. నిన్న జరిగిన దాడిలో కేవలం ఆఫీసు అద్దాలు మాత్రమే పగలలేదని, బ్రాండ్ హైదరాబాద్?పై ఉన్న నమ్మకం కూడా బద్దలైందని ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

భారత్‌ను సైడ్ ప్లేయర్‌గా మార్చారు!

మొదటి పేజీ తరువాయి

పాక్ విద్యార్థి ప్రశ్నకు రాహుల్ సమాధానం

ఇదే సమావేశంలో ఒక పాకిస్థానీ విద్యార్థి అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ, ఉభయ దేశాలు కలిసి పనిచేసే అవకాశం ఉందా అన్నదానికి రాహుల్ సూటిగా స్పందించారు. మన దేశంలో ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడం పాకిస్థాన్ ఆపేంత వరకు చర్చలు అసాధ్యమని, అమాయకులు ప్రాణాలు కోల్పోతుంటే సంభాషణలు జరపలేమని, ఉగ్రవాదం ఆగిన క్షణమే చర్చలు ప్రారంభమవుతాయని స్పష్టం చేశారు. అలాగే ఇజ్రాయెల్‌తో రక్షణ, దౌత్య సంబంధాలను కొనసాగించాలని, అక్టోబర్ దాడులను ఖండిస్తూనే గాజా చర్యలను విమర్శించాల్సి ఉంటుందని, 150 కోట్ల జనాభా కలిగిన భారత్‌కు మన ప్రయోజనాలే ప్రధానమని పేర్కొన్నారు.

రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ తీవ్ర ఆగ్రహం.. 'పాక్ అభిమాని' అంటూ కౌంటర్

విదేశీ గడ్డపై రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ నేతలు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బీజేపీ అధికార ప్రతినిధులు సీఆర్ కేశవన్, ప్రదీప్ భండారీ మాట్లాడుతూ, దేశ ప్రతిష్టను అంతర్జాతీయంగా దెబ్బతీసేలా రాహుల్ మాట్లాడటం అత్యంత హేయమని, ఏ నిజమైన భారతీయుడూ ఇలా మాట్లాడడని విమర్శించారు. రాహుల్ గాంధీకి భౌగోళిక రాజకీయాలపై ఏమాత్రం అవగాహన లేదని, ప్రతి వేదికపైనా ఆయన పాకిస్థాన్ అభిమానిలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రష్యా, ఉక్రెయిన్, ఇరాన్‌లతో భారత్ సమతూకంతో వ్యవహరిస్తోందని, 26/11 ముంబై దాడుల తర్వాత యూపీఏ ప్రభుత్వం వ్యవహరించిన తీరును గుర్తుచేసుకుంటేనే కాంగ్రెస్ వైఖరి ఏమిటో తెలుస్తుందని కౌంటర్ ఇచ్చారు.

బియ్యం ధరలకు సర్కార్ కళ్లెం!

మొదటి పేజీ తరువాయి



మిల్లర్లు, డీలర్లకు కొత్త నిబంధనలు

బియ్యం నిల్వలను నియంత్రించేందుకు మిల్లర్లు, డీలర్లకు ప్రభుత్వం పరిమితులు విధించింది. ప్రతి సంస్థ తమ వద్ద అందుబాటులో ఉన్న బియ్యం నిల్వల వివరాలను కేంద్ర ప్రభుత్వ ఫుడ్ స్టాక్ పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించింది. అంతేకాకుండా ప్రతి శుక్రవారం నిల్వల వివరాలను తప్పనిసరిగా అప్‌డేట్ చేయాలని స్పష్టం చేసింది. నిల్వలకు సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా ఈ చర్యలు చేపట్టింది. బియ్యం నిల్వలను ఉద్దేశపూర్వకంగా దాచిపెట్టడం, తప్పుడు వివరాలు నమోదు చేయడం, రికార్డుల్లో అవకతవకలకు పాల్పడటాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించనుంది. ఇలాంటి చర్యలకు పాల్పడే మిల్లర్లు, డీలర్లు, ఇతర వ్యాపార సంస్థలపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోనుంది. నిల్వల వివరాల్లో పారదర్శకత పాటించాలని ప్రభుత్వం ఆదేశించింది.

తనిఖీలకు అధికారులకు ప్రత్యేక మార్గదర్శకాలు

బియ్యం నిల్వలపై పర్యవేక్షణ పెంచేందుకు అధికారులకు ప్రభుత్వం ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేసింది. బియ్యం నిల్వలు ఎక్కడ ఉన్నా తనిఖీ చేసే అధికారం అధికారులకు కల్పించింది. గోదాములు, ఇతర నిల్వ కేంద్రాలతో పాటు వాహనాలు, నౌకల్లో ఉన్న బియ్యం నిల్వలను కూడా తనిఖీ చేయవచ్చు. నిల్వల పరిమితులను ఉల్లంఘిస్తున్నారా? నిర్ణయించిన ధరల కంటే అధికంగా విక్రయిస్తున్నారా? అనే అంశాలను అధికారులు పరిశీలించనున్నారు. రాష్ట్రంలో బియ్యం ధరలు నియంత్రణలో ఉండేలా చూడటంతో పాటు అక్రమ నిల్వలు, కృత్రిమ కొరత సృష్టించే ప్రయత్నాలను అరికట్టడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో మిల్లర్లు, డీలర్లు ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించింది. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేసింది.

వరంగల్‌కు మెగా సిటీ హంగులు!

మొదటి పేజీ తరువాయి

వరంగల్‌లో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, వర్షపు నీటి పారుదల వ్యవస్థ, వరంగల్ కోట కందకం పునరుద్ధరణ, హనుమకొండలో సెంట్రల్ బిజినెస్ డిస్ట్రిక్ట్ అభివృద్ధి ప్రతిపాదనలపై సమావేశంలో చర్చించారు. రాష్ట్రంలో మురుగునీటిని శుద్ధి చేసి తిరిగి వినియోగించేందుకు ప్రత్యేక విధానాన్ని రూపొందిస్తున్నారు. శుద్ధి చేసిన నీటిని పరిశ్రమలకు, ప్రధానంగా టెక్స్‌టైల్ పార్కులకు వినియోగించడం ద్వారా మంచినీటి వనరులపై ఒత్తిడి తగ్గించేందుకు అవకాశముంది.

పట్టణాల్లో తాగునీటి సరఫరా, నీటి శుద్ధి, పంపిణీ వ్యవస్థల్లో విద్యుత్ వినియోగాన్ని తగ్గించడం, పునరుత్పాదక ఇంధన వనరులను వినియోగించే అంశాలపై చర్చించారు. వరంగల్ మెగా సిటీ ఎకనామిక్ రీజియన్ పరిధిలో వ్యర్థాల నుంచి 10 నుంచి 12 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లాంట్ ఏర్పాటు ప్రతిపాదనను సమీక్షించారు. బయో సీఎన్‌జీ ఉత్పత్తి, ప్లాస్టిక్ రీసైక్లింగ్ యూనిట్ల ఏర్పాటుపై చర్చించారు.

ఈ ప్రాజెక్టుల ద్వారా పట్టణాల్లో కర్బన ఉద్గారాలను తగ్గించడం, నీటి వనరులను సంరక్షించడం, వరద ముప్పును నివారించడం, పురపాలక సంస్థల నిర్వహణ వ్యయాన్ని తగ్గించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా, సీఎంవో కార్యదర్శి మాణిక్ రాజ్, పురపాలక శాఖ కార్యదర్శి టి.కె. శ్రీదేవి పాల్గొన్నారు.

గులాబీ జోరు.. కాంగ్రెస్ బేజారు!

మొదటి పేజీ తరువాయి

కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రాదని, ప్రభుత్వంలో రూ. 5 లక్షల కోట్ల అవినీతి జరిగిందని ఆ పార్టీ ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి స్వయంగా ఆరోపించారని గుర్తు చేశారు. అలాగే, పనులు జరగాలంటే 20 శాతం కమీషన్ ఇవ్వాల్సి వస్తోందని మరో కాంగ్రెస్ ఎమ్మెల్యే బహిరంగంగానే వ్యాఖ్యానించారని ప్రస్తావించారు. సొంత ఎమ్మెల్యేలే తిరగబడుతుండటంతో సీఎం అసహనానికి లోనై, తన పార్టీ ఎమ్మెల్యేలకే పిచ్చి కుక్క కరిచిందని, వారిని ఎర్రగడ్డ ఆసుపత్రిలో చేర్చాలని విచక్షణ కోల్పోయి మాట్లాడుతున్నారని విమర్శించారు.

హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీశారు..

గతంలో కేసీఆర్ అభివృద్ధితో హైదరాబాద్ ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లారని, నగరాన్ని చూసి న్యూయార్క్‌లో ఉన్నానా అని సూపర్ స్టార్ రజినీకాంత్ సైతం ప్రశంసించారని బీఆర్ఎస్ నేతలు గుర్తు చేశారు. కానీ, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పూర్తిగా దెబ్బతిందని ఆరోపించారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో లేని నీటి కష్టాలు, కరెంట్ కోతలు ఇప్పుడు మళ్లీ మొదలయ్యాయని; కేసీఆర్ ఉచిత నల్లా ఇస్తే, ఇప్పుడు అది ఉత్త నల్లాగా మారిందని విమర్శించారు. నగరంలో రోజుకు 80 వేల వాటర్ ట్యాంకర్లను కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని, సర్‌ఛార్జీల పేరుతో కరెంట్ ఛార్జీలను అడ్డగోలుగా పెంచారని మండిపడ్డారు.

పరిశ్రమలు, శాంతిభద్రతలపై వైఫల్యం..

రెండేళ్లుగా రాష్ట్రానికి పరిశ్రమలు, ఐటీ శాఖలకు పూర్తిస్థాయి కార్యదర్శులు లేరని, కేవలం చీఫ్ సెక్రటరీకి ఇన్‌ఛార్జ్ బాధ్యతలు అప్పగించి పరిశ్రమలను ఎలా ఆకర్షిస్తారని ప్రశ్నించారు. గత ఏడాది నిర్వహించిన 'తెలంగాణ రైజింగ్' సదస్సు ద్వారా ఎన్ని పరిశ్రమలు వచ్చాయో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీఎం వద్దే హోం, మున్సిపల్ శాఖలు ఉన్నప్పటికీ శాంతిభద్రతలు క్షీణించాయని, కేసీఆర్ హయాంలో ఏర్పాటు చేసిన 10 లక్షల సీసీ కెమెరాలలో ప్రస్తుతం 5 లక్షలు పనిచేయడం లేదని ఆరోపించారు. ఉన్న నగరంలో చెత్త, దోమలు, తాగునీటి సమస్యలను పరిష్కరించలేని ప్రభుత్వం 'ఫ్యూచర్ సిటీ' గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు.

వైద్యం, విద్య, సంక్షేమ పథకాల నిర్వీర్యం..

హైదరాబాద్‌లో తాము 300 బస్తీ దవాఖానాలు, టీ-డయాగ్నస్టిక్ కేంద్రాలను ఏర్పాటు చేసి 147 రకాల పరీక్షలు ఉచితంగా అందించామని, కానీ నేడు ఆసుపత్రుల్లో కనీసం బీపీ, షుగర్ మాత్రలు కూడా దొరకడం లేదని బీఆర్ఎస్ నేతలు విమర్శించారు. కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్ నిలిపివేయడంతో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు తగ్గిపోయాయని, మూడేళ్లుగా టిమ్స్ ఆసుపత్రుల నిర్మాణం, డాక్టర్ల నియామకాలను పట్టించుకోవడం లేదని అన్నారు. విద్యాశాఖ మంత్రిగా ఉన్న సీఎం, ప్రభుత్వ పాఠశాలలను బాగు చేయకుండా ఆయన కుటుంబ సభ్యులు కార్పొరేట్ స్కూళ్లు ప్రారంభించడం వైఫల్యానికి నిదర్శనమని ఆరోపించారు. మెగా డీఎస్సీ, రెండు లక్షల ఉద్యోగాల హామీని నెరవేర్చలేదని, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు ఇవ్వక విద్యార్థుల చదువులు ఆగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 43 లక్షల పెన్షన్లలో 4 లక్షలు తొలగించి కొత్తగా 4 లక్షలు ఇచ్చారని, రూ. 4 వేల పెన్షన్ హామీతో వృద్ధులను మోసం చేశారని మండిపడ్డారు.

కేంద్రం వివక్ష.. బడే భాయ్, చోటే భాయ్ బంధం..

రాష్ట్రంలో కరువు పరిస్థితులు నెలకొన్నా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఒక్క పైసా కూడా సాయం చేయలేదని, కనీసం కరువు బృందాలను కూడా పంపలేదని బీఆర్ఎస్ నేతలు విమర్శించారు. ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం నిధులు, బృందాలను పంపుతూ తెలంగాణకు మాత్రం మొండిచేయి చూపుతోందని ఆరోపించారు. 'బడే భాయ్ - చోటే భాయ్' (బీజేపీ, కాంగ్రెస్) బంధానికి తెలంగాణ ప్రయోజనాలు బలవుతున్నాయని, ఈ రెండు పార్టీల తీరుతో విసిగిపోయిన రాష్ట్ర ప్రజలందరూ మళ్లీ కేసీఆర్ వైపే చూస్తున్నారని వారు స్పష్టం చేశారు.

పల్నాడు వాటర్ గ్రిడ్: సీఎం రేవంత్ రెడ్డికి కవిత అల్టిమేటం

న్యూస్ డెస్క్, 21 నవంబర్ (ఇది కద నిజం): తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తీరు వల్లే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరోసారి జలదోపిడీకి తెరలేపిందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత విమర్శించారు. ప్రజాభవన్‌కు చంద్రబాబును పిలిచి కాళ్లు కడిగి, గురుదక్షిణగా మన రాష్ట్ర నీళ్లను ఏపీకి అప్పగించారని ఆరోపించారు. నాగార్జున సాగర్‌పై ఏపీ అక్రమంగా నిర్మిస్తున్న 'పల్నాడు వాటర్ గ్రిడ్' ప్రాజెక్టును వారం రోజుల్లోగా ఆపకపోతే, వేలాది మందితో సాగర్ డ్యామ్‌ను ముట్టడిస్తామని కవిత ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేశారు. ఆ సమయంలో జరిగే పరిణామాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

ప్రోటోకాల్స్ విస్మరించి రేవంత్ ఒప్పందాలు: సీఎం రేవంత్ రెడ్డి అన్ని రకాల ప్రోటోకాల్స్‌ను పక్కనపెట్టి వ్యవహరిస్తున్నారని కవిత విమర్శించారు. అపెక్స్ కౌన్సిల్ సమావేశం నిర్వహించాలని డిమ

Registered No : APTEL/25/A0818

ఇది కద నిజం

ఆదివారం 21-11-2026

పేదింటి ఆడబిడ్డలకు కళ్యాణలక్ష్మి భరోసా!

కంబాపూర్‌లో లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ



ఇది కద నిజం, పిట్లం, నవంబర్ 21 :కామారెడ్డి జిల్లా పిట్లం మండలంలోని కంబాపూర్ లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న కళ్యాణలక్ష్మి పథకం పేద కుటుంబాలకు ఎంతో భరోసానిస్తోందని పలువురు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నేడు కంబాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో కళ్యాణలక్ష్మి పథకం లబ్ధిదారులు పాంపాటి శోభ, కురుమ నరసవ్వలకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గురుకుల సుజాత శ్రావణ్ దేశాయ్, ఉపసర్పంచ్ ఎర్ర అంజవ్వ, పంచాయతీ కార్యదర్శి అంబయ్య తదితరులు పాల్గొన్నారు.

పిట్లంలో వైభవంగా శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి 418వ జయంతి వేడుకలు!





ఇది కద నిజం ,ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నవంబర్ 21, పిట్లం: పిట్లం పట్టణంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి మందిరంలో శనివారం స్వామివారి 418వ జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టి భక్తులు స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. జయంతి వేడుకలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల జయజయధ్వానాలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

ఈఎల్‌టీఏ ఆధ్వర్యంలో మండల స్థాయి ఆంగ్ల ఉపన్యాసం, టాలెంట్ టెస్టులు



ఇది కద నిజం ,ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నవంబర్ 21, పిట్లం: ఇంగ్లీష్ లాంగ్వేజ్ అసోసియేషన్ (ఈఎల్‌టీఏ) ఆధ్వర్యంలో మండల స్థాయి ఆంగ్ల ఉపన్యాస పోటీలు, టాలెంట్ టెస్టులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారి శ్రీదేవి సింగ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, విద్యార్థులు ఆంగ్ల భాషపై ఆసక్తి పెంపొందించుకుని మంచి పట్టు సాధించాలని సూచించారు. ఆంగ్ల భాషా పరిజ్ఞానంతో ప్రపంచస్థాయి జ్ఞానాన్ని పొందవచ్చని తెలిపారు. మండల స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం పోటీల్లో మొదటి, రెండో స్థానాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బాయ్స్ హైస్కూల్ ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు రూప్‌సింగ్, మండల ఇంగ్లీష్ అసోసియేషన్ కార్యదర్శి సాయిబాబా, ఆంగ్ల ఉపాధ్యాయులు బాల్‌సింగ్, సంతోష్, పీఆర్‌టీయూ రాష్ట్ర నాయకులు సంతోష్ రెడ్డి, ప్రమోద్ కుమార్‌తో పాటు వివిధ పాఠశాలల ఆంగ్ల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెక్ బౌన్స్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక లోక్ అదాలత్

జిల్లాలో 11 కేసులకు మోక్షం

డిసెంబర్ 12న జాతీయ లోక్ అదాలత్



ఇది కద నిజం:యాదాద్రి భువనగిరి జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ప్రత్యేక లోక్ అదాలత్‌లో 11 చెక్ బౌన్స్ కేసులను పరిష్కరించినట్లు సంస్థ అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ. జయరాజు తెలిపారు. దేశవ్యాప్తంగా చెక్ బౌన్స్ కేసుల సత్వర పరిష్కారం కోసం ఈ ప్రత్యేక లోక్ అదాలత్‌ను ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. లోక్ అదాలత్‌లను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవడం వల్ల సమయంతో పాటు ఆర్థికంగా ఎంతో మేలు జరుగుతుందని, సామాజికంగా అభివృద్ధి చెందడమే కాకుండా సమాజంలో మనుషుల మధ్య సత్సంబంధాలు బలపడతాయని చెప్పారు. నేర ప్రవృత్తిని విడనాడటానికి ఇదొక మంచి అవకాశమని అభిప్రాయపడ్డారు. రాబోయే నాలుగవ జాతీయ లోక్ అదాలత్‌ను డిసెంబర్ 12న నిర్వహించనున్నట్లు వెల్లడించిన ఆయన, కక్షిదారులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని శనివారం విడుదల చేసిన ఒక పత్రికా ప్రకటనలో కోరారు.

యాదగిరిగుట్టకు పోటెత్తిన భక్తులు

- కార్తీక మాసం, వీకెండ్ కావడంతో ఆలయంలో రద్దీ
- 1,417 జంటలచే సత్యనారాయణ స్వామి వ్రతాలు



ఇది కద నిజం, యాదాద్రి :యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. కార్తీక మాసంతో పాటు శనివారం వీకెండ్ కావడంతో స్వామివారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం నుంచే ఆలయ పరిసరాలు, క్యూలైన్లు భక్తుల రద్దీతో సందడిగా మారాయి. కార్తీక మాస పర్వదినాలను పురస్కరించుకుని ఆలయ సత్యనారాయణ స్వామి వ్రత మండపంలో భక్తులు పెద్ద ఎత్తున సామూహిక వ్రత పూజలు నిర్వహించుకున్నారు. శనివారం ఒక్కరోజే 1,417 కుటుంబాలు స్వామివారి వ్రతాలలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నాయి. వ్రతాల అనంతరం భక్తులు ప్రధానాలయంలోని లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మరోవైపు, అనుబంధ ఆలయమైన శివాలయంలోనూ భక్తుల రద్దీ నెలకొంది. భక్తులు పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి, పర్వత వర్ధిని సమేత రామలింగేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో కార్తీక దీపారాధనలు చేసి తమ మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

స్వామివారిని దర్శించుకున్న కమిషనర్ పమేలా సత్పతి



ఇది కద నిజం, యాదాద్రి :తెలంగాణ కార్మిక శాఖ కమిషనర్ యాదాద్రి భువనగిరి జిల్లా మాజీ కలెక్టర్ పమేలా సత్పతి ఐఏఎస్ స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆమెకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. దర్శనానంతరం ఫోటోజర్నలిస్ట్ గుజ్జ నరేష్ ఆహ్వానం మేరకు ఆమె 'ట్రెండీ గిఫ్ట్ స్టోర్'ను సందర్శించారు. ఈ సందర్భంగా గుజ్జ నరేష్ ఆమెను మర్యాదపూర్వకంగా సన్మానించి స్వామివారి ప్రతిమను జ్ఞాపికగా అందజేశారు.

యాదగిరిగుట్టలో కార్తీకోత్సవ వేడుకల్లో భాగంగా ఘనంగా సంగీత విభావరి



ఇది కద నిజం ,యాదగిరిగుట్ట: శ్రీ లక్ష్మీనరసింహస్వామివారి దేవస్థానం యాదగిరిగుట్టలో నిర్వహిస్తున్న కార్తీకోత్సవ వేడుకల్లో భాగంగా ఈరోజు మాడవీధులలో ప్రముఖ సంగీత దర్శకులు శ్రీ ఆర్.పి. పట్నాయక్ గారి ఆధ్వర్యంలో సంగీత విభావరి కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ గాయకులు, గాయనీమణులు స్వామివారి భక్తి గీతాలను మధురంగా ఆలపించి భక్తులను భక్తి పారవశ్యంలో ముంచెత్తారు. తమ అద్భుతమైన గాత్రంతో స్వామివారి దివ్య మహిమలను కీర్తిస్తూ భక్తులలో ఆధ్యాత్మిక భావాలను, భక్తి శ్రద్ధలను పెంపొందించారు. ఈ సంగీత విభావరి కార్యక్రమాన్ని భక్తులు ఎంతో ఆసక్తిగా, ఆనందోత్సాహాలతో తిలకించి సంగీతాన్ని ఆస్వాదించారు. మాడవీధులు భక్తి సంగీతంతో మార్మోగాయి.

కార్యక్రమంలో పాల్గొన్న కళాకారులు:

1. ఆర్.పి. పట్నాయక్ – ప్రముఖ సంగీత దర్శకులు
2. నిహాల్
3. నిత్య సంతోషిణి
4. గోపికా పూర్ణిమ
5. శ్రీనిధి
6. మల్లికార్జున్
7. స్వప్న (జర్నలిస్టు)

వాద్య బృందం సహకారంతో నిర్వహించిన సంగీత కార్యక్రమం, పరంపర సంస్థ వారి దర్శకత్వంలో ప్రత్యేక నృత్య ప్రదర్శనలతో మరింత ఆకర్షణీయంగా సాగింది. కార్తీక మాస ఆధ్యాత్మిక వైభవాన్ని ప్రతిబింబించేలా నిర్వహించిన ఈ సంగీత విభావరి భక్తులకు మరపురాని అనుభూతిని అందించింది.

రాజ్యాంగ ఫలాలను అందిపుచ్చుకుంటేనే మహిళా సాధికారత

26న రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మహిళలు -- రాజ్యాంగం సదస్సు పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత



ఇది కద నిజం ,హైదరాబాద్: భారత రాజ్యాంగ ఫలాలను అందిపుచ్చుకుంటేనే మహిళా సాధికారత సాధ్యమవుతుందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఈనెల 26న నిర్వహించనున్న మహిళలు – రాజ్యాంగం సదస్సు పోస్టర్ ను శనివారం బంజారాహిల్స్ లోని పార్టీ కార్యాలయంలో మహిళా నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, భారత రాజ్యాంగం మహిళలకు ఎన్నో హక్కులను కల్పించిందని.. వాటిని సంపూర్ణంగా వినియోగించుకుంటే ప్రపంచంలోనే అగ్రగామిగా ఎదుగుతామని తెలిపారు. 26న ఉదయం 10 గంటల నుంచి బాగ్ లింగంపల్లి లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సదస్సు నిర్వహిస్తామని తెలిపారు. భారత రాజ్యాంగం మహిళలకు కల్పించిన హక్కులు, ఆ ఫలాలు ఎంతమేరకు అందుతున్నాయి.. భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 ఏళ్లు పూర్తయిన తరుణంలో వివిధ రంగాల్లో పని చేస్తున్న మహిళలు.. శ్రామికులు, గృహిణుల జీవన స్థితిగతులు సహా మహిళలకు సంబంధించిన అన్ని అంశాలపై సదస్సులో చర్చించి తీర్మానాలు చేస్తామని తెలిపారు. పార్టీ మహిళా నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో ఈ సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు.

గట్టుఇప్పల పల్లి గ్రామాన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఏర్పాటు చేయాలి బీఆర్ఎస్ నాయకుల డిమాండ్



అమనగల్,ఇది కద నిజం: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా విడుదల చేసిన

పిఏసిఎస్ నూతన సంఘాలలో గట్టుఇప్పల పల్లి గ్రామములో ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రం ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా విడుదల చేసిన 240 నూతన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల లిస్ట్ లో మా గట్టు ఇప్పలపల్లి గ్రామం లేకపోవడం చాలా బాధాకరమని తలకొండపల్లి మండలములో తలకొండపల్లి పల్లి తర్వాత అత్యధిక జనాభా విస్తీర్ణం కలిగిన గట్టు ఇప్పలపల్లి గ్రామాన్ని అన్ని రకాలుగా అభివృద్ధిని వెనుకకు నెట్టడడం ఎంతవరకు సమంజసమని వారు విమర్శించారు గతంలో ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే గట్టు ఇప్పలపల్లి గ్రామాన్ని మండలం చేస్తాం అని చెప్పి దాని గురుంచి పట్టించుకోవడం లేదు ఇప్పుడు పిఏసిఎస్ కేంద్రం కూడా ఏర్పాటు చేయకపోవడం చాలా బాధాకరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు ఈ గ్రామములో ఉన్న కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే దగ్గరకి వెళ్లి గట్టు ఇప్పలపల్లి గ్రామములో పిఏసిఎస్ కేంద్రం ఏర్పాటు చేసేలాగా హామీ తీసుకురావాలని కోరుతున్నామని లేని యడల అన్ని పార్టీల నాయకులను గ్రామ ప్రజలని కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమములో తలకొండపల్లి మండల బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి చంద్రశేఖర్ రెడ్డి మాజీ సర్పంచ్ జె వెంకటయ్య గ్రామ అధ్యక్షుడు ఏదుల రాజు ఉపాధ్యక్షుడు కానుగులజంగయ్య మండల కృష్ణయ్య శరత్ చంద్ర శర్మ విజేందర్ యాదవ్ సాధిక్, బొల్లి కృష్ణ, కొండల్ ఇట్యాల రవీందర్ శ్రీశైలం పురుషోత్తం రత్నయ్య ఆంజనేయులు ప్రవీణ్ మల్లేష్ కార్తీక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం

ప్రారంభించిన గ్రామ సర్పంచ్ అనిత



ఆమనగల్, ఇది కద నిజం: ఈ రోజు రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల పరిధిలో ని దేవునిపడకల్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమాకార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ కానుగుల అనిత మల్లేష్ ఎంపీడీఓ సీతారామమ్మా ప్రారంభించారు కార్యక్రమాన్ని గ్రామ ప్రజలందరు సద్వినియోగపర్చుకోవాలని సూచించారు ప్రతీ కుటుంబ పెద్ద 18 సంవత్సరాలనుండి 59 సంవత్సరాల లోపు ఉన్నా వారందరు భీమా కు అర్హులని తెలిపారు ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ అంబటి వెంకటేష్ వార్డు సభ్యులు కడమోని రాము అంబటి లక్ష్మయ్య రాజమోని జ్యోతి లక్ష్మయ్య పంచాయతీ కార్యదర్శి నరేష్ గౌడ్ అంగన్వాడీ టీచర్ బొరమ్మ విఓఏ కానుగుల బాలకిష్టయ్య గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

విపక్షాల కుట్రలను తిప్పికొట్టేందుకు ఈ నెల 23న కరీంనగర్‌లో కమల దండు

కవాతు: ఎల్కతుర్తి నుండి 12 బస్సుల్లో తరలనున్న కాషాయ సైన్యం



ఎల్కతుర్తి,ఇది కద నిజం: దేశవ్యాప్తంగా అత్యంత పారదర్శకంగా జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) ప్రక్రియపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరియు ఇండియా కూటమి పక్షాలు చేస్తున్న నిరాధారమైన 'ఓటు చోరీ' ఆరోపణలను ఎండగట్టడానికి, రాజ్యాంగ సంస్థలపై విపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టడానికి భారతీయ జనతా పార్టీ సమరశంఖం పూరించింది. ఇందులో భాగంగా ఈ నెల 23వ తేదీ (సోమవారం) కరీంనగర్ వేదికగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ నాయకత్వంలో, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో లక్ష మందితో చారిత్రాత్మక 'మహా పాదయాత్ర' జరగనుంది.

ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఈ నెల 23న జరుగుతున్న ఈ మహా పాదయాత్రను విజయవంతం చేసేందుకు హనుమకొండ జిల్లా, ఎల్కతుర్తి మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు మంతూర్తి శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో బీజేపీ శ్రేణుల సన్నాహక సమావేశం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లక్కిరెడ్డి తిరుమల విచ్చేయగా, జిల్లా నాయకుడు చిరంజీవి, పల్లెపాటి మధుకర్, ఎల్కతుర్తి మండల ప్రధాన కార్యదర్శి వెంకటేష్, అల్లి కుమార్ వీరితో పాటు మండలంలోని అన్ని గ్రామాల నుండి బీజేపీ ముఖ్య నాయకులు, బూత్ స్థాయి కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చి సమావేశాన్ని విజయవంతం చేశారు.

ఈ సందర్భంగా నాయకులు కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తూ... దేశ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న కాంగ్రెస్, ఇండియా కూటమి కుట్రలను తిప్పికొట్టేందుకు ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా కదిలిరావాలని పిలుపునిచ్చారు. ఈ నెల 23న కరీంనగర్‌లో జరిగే మహా పాదయాత్రకు ఎల్కతుర్తి మండలం నుండి కాషాయ దండు భారీ ఎత్తున తరలివెళ్లేందుకు మండల నాయకత్వం ఆధ్వర్యంలో ప్రత్యేకంగా 12 బస్సులను సిద్ధం చేసినట్లు ప్రకటించారు. మండలంలోని ప్రతి గ్రామం నుండి కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రధాని మోదీ నాయకత్వాన్ని, పార్టీ బలాన్ని చాటాలని కోరారు.

సీఎం రేవంత్ రెడ్డి తీరుతోనే ఏపీ జలదోపిడీ

చంద్రబాబుకు గురుదక్షిణగా మన నీళ్లను అప్పగిస్తున్నరు

నాగార్జున సాగర్ పై ఏపీ అక్రమ ప్రాజెక్టును వారం రోజుల్లోగా నిలిపి వేయించాలి

లేదంటే వేలాది మందితో సాగర్ డ్యామ్ ను ముట్టడిస్తాం

తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత



ఇది కద నిజం ,హైదరాబాద్: తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తీరుతోనే ఏపీ జలదోపిడీకి పాల్పడుతోందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. శనివారం ఈమేరకు వీడియో సందేశం రిలీజ్ చేశారు. ఏపీ సీఎం చంద్రబాబును పిలిచి ప్రజాభవన్ లో కాళ్లు కడిగి గురుదక్షిణగా మన నీళ్లను అప్పగించారని తెలిపారు. రేవంత్ రెడ్డి ఆమోదంతోనే చంద్రబాబు పోలవరం – బనకచర్ల లింక్ ప్రాజెక్టును చేపట్టారని తెలిపారు. రేవంత్ రెడ్డి అన్ని రకాల ప్రొటోకాల్స్ ను విస్మరించి పని చేస్తున్నారని, ఫలితంగా రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. జలవివాదాలపై అపెక్స్ కౌన్సిల్ సమావేశం కోసం డిమాండ్ చేయకుండా కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ తో అన్ అఫీషియల్ మీటింగ్ కు వెళ్లి పోలవరం – బనకచర్లకు ఒప్పుకొని వచ్చారని తెలిపారు.

రేవంత్ రెడ్డి అడ్డుకోలేదనే ధైర్యంతోనే ఏపీ ప్రభుత్వం తాగు నీటి పేరుతో నాగార్జున సాగర్ నీళ్లకు గండికొడుతోందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలోనే ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాలు ఎంతటి జలదోపిడీకి పాల్పడ్డాయో తెలంగాణ ప్రజల కళ్ల ముందర ఉందన్నారు. తాగునీరు పేరుతో శ్రీశైలం ప్రాజెక్టుపై పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నిర్మించి ఇప్పుడు మొత్తం రిజర్వాయర్ నే మళ్లించుకునే స్థాయిలో పనులు చేసుకున్నారని గుర్తు చేశారు. ఇప్పుడు నాగార్జున సాగర్ పై ఏపీ కన్ను పడిందని.. ఇప్పటికే తాగునీటి కోసం 2.8 టీఎంసీలను తీసుకుంటున్న ఆంధ్రప్రదేశ్ లిఫ్ట్ పేరుతో మరో 1.8 టీఎంసీలను తరలించేందుకు రంగం సిద్ధం చేశారని అన్నారు. తాగునీటి పేరు చెప్పి ప్రాజెక్టులు మొదలు పెట్టి మొత్తం రిజర్వాయర్ లోని నీటిని ఎత్తుకుపోవడం ఏపీ నైజం అన్న సంగతి మనందరికి తెలుసన్నారు.

ఏపీ ప్రభుత్వం 9 నెలలుగా అక్రమ ప్రాజెక్టు నిర్మిస్తుంటే తెలంగాణ ప్రభుత్వానికి కనీస సమాచారం లేదు అనే వాదనను ఎలా నమ్మాలని ప్రశ్నించారు. ఎక్కడ ఏం జరిగినా ఇంటెలిజెన్స్ ముఖ్యమంత్రిని అలర్ట్ చేస్తుందని.. దురదృష్టవశాత్తు రాష్ట్రం హోం శాఖ బాధ్యతలు కూడా చూస్తున్న రేవంత్ రెడ్డికి ఏపీ అక్రమ ప్రాజెక్టు గురించి తెలియక పోవడం అనేక సందేహాలకు తావిస్తోందన్నారు. నిజంగానే సమాచారం తెలియదా? తెలిసినా తన సమ్మతితోనే ప్రాజెక్టు చేపట్టింది కాబట్టి మౌనంగా ఉన్నారనే విషయంలో క్లారిటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీజేపీకి తెలంగాణ ఓట్లు.. సీట్లు కావాలి తప్ప రాష్ట్ర ప్రయోజనాలు పట్టవా అని ప్రశ్నించారు. అన్ని అంశాలపై స్పందించే ఎంపీ రఘునందన్ రావు, కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డి ఏపీ అక్రమ ప్రాజెక్టుపై ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ఏపీలో బీజేపీకి టీడీపీతో పొత్తు ఉంది కాబట్టి తెలంగాణ ప్రయోజనాలను తాకట్టు పెడుతారా అని నిలదీశారు. తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రులు, బీజేపీ ఎంపీలు వెంటనే ప్రధాని వద్దకు వెళ్లి ఏపీ అక్రమ ప్రాజెక్టును నిలిపి వేయించాలని.. ఆ ప్రాజెక్టుకు కేంద్రం 50 శాతం నిధులు జల్ జీవన్ మిషన్ నుంచి ఇవ్వకుండా అడ్డుకోవాలని సూచించారు. ఏపీ అక్రమ ప్రాజెక్టును ఆపాల్సిన బాధ్యత సీఎం రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రులు, బీజేపీ ఎంపీలదేనని స్పష్టం చేశారు. వారం రోజుల్లోగా ఏపీ అక్రమ ప్రాజెక్టును నిలిపి వేయించకుంటే వేలాది మంది ప్రజలతో నాగార్జున సాగర్ డ్యాంను ముట్టడిస్తామని.. అందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే బాధ్యత వహించాల్సి ఉంటుందని తేల్చిచెప్పారు.

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
ఆదివారం 21-11-2026



మెగా హీరోతో మరో హనుమాన్!



టాలీవుడ్‌లో అందరినీ షాక్‌కి గురిచేస్తూ ‘హను-మాన్ 2’ సినిమాపై ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ అధికారిక ప్రకటన చేసింది. మెగా హీరో పంజా వైష్ణవ్ తేజ్ హీరోగా, విభిన్న కథలతో ఆకట్టుకునే వి ఐ ఆనంద్ దర్శకత్వంలో ఈ భారీ పాన్-ఇండియా సినిమా తెరకెక్కనుంది. ఈ చిత్రానికి ‘హను-మాన్ 2 -- ది రైజ్ ఆఫ్ వానరాస్’ అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేశారు. గతంలో ‘ఎక్కడికి పోతావు చిన్నవాడా’, ‘ఊరు పేరు భైరవకోన’ వంటి ఫాంటసీ, థ్రిల్లర్ సినిమాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్న వి ఐ ఆనంద్, ఈసారి సరికొత్త పౌరాణిక ఫాంటసీ కథతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు.

తాజాగా విడుదల చేసిన ఈ సినిమా అనౌన్స్‌మెంట్ పోస్టర్ సోషల్ మీడియాలో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఇందులో కాషాయ వస్త్రం కట్టుకున్న వైష్ణవ్ తేజ్ కండలు తిరిగిన శరీరంతో వెనుకకు తిరిగి నిలబడి ఉండగా, ఒక భారీ హనుమంతుడి తోక ఆయనను చుట్టుకుని ఆకాశంలోకి ఎత్తుతున్నట్లుగా పోస్టర్‌ను ఎంతో ఆకట్టుకునేలా రూపొందించారు. మొదటి భాగం ‘హను-మాన్’ సినిమాను నిర్మించిన ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై కె. నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి ఈ సీక్వెల్‌ను కూడా భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. తెలుగుతో పాటు హిందీ, తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో పాన్-ఇండియా స్థాయిలో ఈ సినిమా విడుదల కానుంది.

మరోవైపు, ఈ ప్రకటన ఇప్పుడు తెలుగు సినీ పరిశ్రమలో పెద్ద చర్చకు దారితీసింది. మొదటి భాగం ‘హను-మాన్’కు దర్శకత్వం వహించిన ప్రశాంత్ వర్మ, ప్రస్తుతం మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణంలో రిషబ్ శెట్టి హీరోగా ‘జై హనుమాన్’ సినిమాను తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. అయితే ‘హను-మాన్’ కథ, సీక్వెల్ హక్కులు తమ నిర్మాణ సంస్థకే చెందుతాయని భావిస్తున్న ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్, ఇప్పుడు వైష్ణవ్ తేజ్ -వి ఐ ఆనంద్ కాంబినేషన్‌లో నేరుగా ‘హను-మాన్ 2’ ప్రకటించడం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. త్వరలోనే ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానుండగా, ఇందులో నటించే ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను చిత్ర బృందం త్వరలో వెల్లడించనుంది.

‘ఇడుపుకాయితం’లో పెళ్లి సందడి!



విభిన్న పాత్రలతో ప్రేక్షకులను మెప్పించే ప్రియదర్శి హీరోగా నటిస్తున్న తాజా చిత్రం ‘ఇడుపు కాయితం’. జానపద పాటలతో గుర్తింపు పొందిన నాగదుర్గ ఈ చిత్రంలో కథానాయికగా కనిపించనున్నారు. యువ దర్శకుడు వంశీరెడ్డి దొండపాటి తెరకెక్కిస్తున్న ఈ ఎంటర్‌టైనింగ్ ఫ్యామిలీ డ్రామాను బన్నీవాస్ వర్క్స్, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్లపై బన్నీవాస్, తబిత సుకుమార్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమా డిసెంబర్ 11న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ప్రచారంలో భాగంగా చిత్రబృందం తాజాగా ‘గోగులు గోగులు..’ అనే లిరికల్ పాటను విడుదల చేసింది.

శ్రీనివాస్ పాత్రలో ప్రియదర్శి, శ్రీలత పాత్రలో నాగదుర్గల పెళ్లి వేడుక నేపథ్యంలో ఈ పాటను రూపొందించారు. సంగీత దర్శకుడు సురేష్ బొబ్బిలి ఆకట్టుకునే బాణీ సమకూర్చగా, కొంగరి కృష్ణ సాహిత్యం అందించారు. అభిక్య తనికెళ్ల, తరుణి, రచిత రాయప్రోలు, జయశ్రీ పల్లెం, స్నిగ్ధ శర్మ కలిసి ఈ గీతాన్ని ఆలపించారు. ‘గోగులు గోగులు గోపాలకృష్ణుడు సేలి, గోగులు గోగులు గోపాలకృష్ణుడు సేలి, గోగులు గోగులు గోపాలకృష్ణుడు ఆనంద బాలుడు నందకుమారుడు, రమ్మనరే రమ్మనరే నలుగుకు నా ముద్దు గోపాలకృష్ణున్ని, రమ్మనరే నలుగుకు నా ముద్దు గోపాల కృష్ణుని...’ అంటూ సాగే ఈ పాట వేడుక వాతావరణాన్ని చక్కగా ప్రతిబింబిస్తోంది.

అండర్‌కవర్ కాప్‌గా



లేడీ సూపర్ స్టార్ నయనతార బాలీవుడ్‌లో మరోసారి తన సత్తా చాటేందుకు సిద్ధమయ్యారు. ‘జవాన్’ బ్లాక్‌బస్టర్ తర్వాత ఆమె నటిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం ‘మాన్‌స్టర్’. బాలీవుడ్ స్టార్ సల్మాన్ ఖాన్ హీరోగా, టాలీవుడ్ డైరెక్టర్ వంశీ పైడిపల్లి దర్శకత్వంలో, దిల్ రాజు నిర్మిస్తున్న ఈ సినిమాలో నయనతార అత్యంత పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నట్లు టాక్. ఈ సినిమాలో సల్మాన్ ఖాన్‌కు సమానమైన స్క్రీన్ స్పేస్‌తో పాటు, కథను మలుపు తిప్పే అదిరిపోయే ట్విస్ట్ ఆమె పాత్రలో ఉందని తెలుస్తోంది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వార్తలు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. ‘మాన్‌స్టర్’ చిత్రంలో నయనతార సల్మాన్ ఖాన్‌కు భార్యగా కనిపించనున్నారు. అయితే ఇక్కడే ప్రేక్షకులకు ఊహించని షాక్ ఉంది.

ఆమె కేవలం సాధారణ గృహిణిగా కాకుండా, తన సొంత భర్తనే చట్టానికి పట్టించే ఒక రహస్య మిషన్‌పై పనిచేసే అండర్ కవర్ పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తున్నట్లు తెలుస్తోంది. ఒకవైపు భర్త పట్ల ప్రేమ, మరోవైపు విధి నిర్వహణలో భాగంగా ఆయనకే వ్యతిరేకంగా పోరాడాల్సిన పరిస్థితి రావడంతో, నయనతార పాత్ర చుట్టూనే సినిమాలోని ఎమోషనల్, యాక్షన్ సన్నివేశాలు నడవనున్నాయని టాక్. ఈ హై-వోల్టేజ్ క్యారెక్టర్ నయనతార నటనకు మరో పెద్ద ఛాలెంజ్ కానుంది. సల్మాన్ ఖాన్, నయనతార, వంశీ పైడిపల్లి కాంబినేషన్‌లో వస్తున్న మొదటి సినిమా ఇదే కావడంతో భారీ అంచనాలు నెలకొన్నాయి. 2027 రంజాన్ (ఈద్) కానుకగా థియేటర్లలో విడుదల కానున్న ఈ పాన్ ఇండియా చిత్రం, నయనతార కెరీర్‌లోనే ఒక మైలురాయిగా నిలవనుంది.

‘దృశ్యం-3’ స్ట్రీమింగ్ డేట్



బాలీవుడ్ స్టార్ అజయ్ దేవగణ్ ప్రధాన పాత్రలో నటించిన లేటెస్ట్ మూవీ ‘దృశ్యం-3’. గతంలో వచ్చిన రెండు భాగాలు సూపర్ హిట్ కావడంతో, ఈ మూడో భాగాన్ని ‘దృశ్యం-3: ది కంక్లూజన్’ పేరుతో ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. అభిషేక్ పాఠక్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో జైదీప్ అహ్లావత్, శ్రియా శరన్, ఇషితా దత్తా, టబు, రజత్ కపూర్, ప్రకాష్ రాజ్, మృణాల్ జాదవ్ కీలక పాత్రల్లో నటించారు. ఈ ఏడాది అక్టోబర్ 2న థియేటర్లలో విడుదలైన ఈ సినిమా ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది.

అంతేకాకుండా బాక్సాఫీసు వద్ద కూడా ఈ చిత్రం భారీ వసూళ్లతో దుమ్మురేపింది. ప్రపంచవ్యాప్తంగా రూ.500 కోట్లకు పైగా కలెక్షన్లు రాబట్టి, ఈ ఏడాది బాలీవుడ్‌లో అత్యధిక వసూళ్లు సాధించిన రెండో సినిమాగా ఘనత సాధించింది. థియేటర్లలో ఘన విజయం సాధించిన ఈ చిత్రం ఇప్పుడు డిజిటల్ స్ట్రీమింగ్‌కు సిద్ధమైంది. ‘దృశ్యం-3’ ఓటీటీ హక్కులను ప్రముఖ స్ట్రీమింగ్ సంస్థ నెట్‌ఫ్లిక్స్ సొంతం చేసుకుంది. నవంబర్ 27 నుంచి నెట్‌ఫ్లిక్స్ వేదికగా ఈ సినిమా స్ట్రీమింగ్ కాబోతున్నట్లు అధికారికంగా ప్రకటించారు. థియేటర్లలో మిస్ అయిన వాళ్లు, అలాగే మరోసారి ఈ సస్పెన్స్ థ్రిల్లర్‌ను చూడాలనుకునే వాళ్లకు ఇది గుడ్ న్యూస్ అనే చెప్పాలి.

‘వృషకర్మ’ వాయిదా



టాలీవుడ్ బాక్సాఫీసు వద్ద డిసెంబర్ నెల సినిమాల లెక్కలు ఒక్కసారిగా మారిపోతున్నాయి. అక్కినేని నాగచైతన్య నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం ‘వృషకర్మ’ ముందుగా ప్రకటించినట్లుగా డిసెంబర్ 4న థియేటర్లలోకి రావడం లేదని సమాచారం. పోస్ట్ ప్రొడక్షన్ పనులు ఇంకా పూర్తి కాకపోవడంతో మేకర్స్ ఈ సినిమాను వాయిదా వేయాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. విజువల్ ఎఫెక్ట్స్, ఇతర సాంకేతిక పనులకు సమయం పడుతుండటంతో, నాణ్యత విషయంలో రాజీ పడకూడదనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నారట. ఈ చిత్రాన్ని క్రిస్మస్ కానుకగా.. డిసెంబర్ 24న తీసుకురావాలని ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది.

‘విరూపాక్ష’ వంటి సంచలన విజయం తర్వాత దర్శకుడు కార్తీక్ వర్మ దండు తెరకెక్కిస్తున్న ఈ మైథికల్ అడ్వెంచర్ థ్రిల్లర్ నాగచైతన్య కెరీర్‌లోనే అత్యధికంగా రూ.100 కోట్లకు పైగా బడ్జెట్‌తో రూపొందుతోంది. ఇందులో చైతూ పురావస్తు శాస్త్రవేత్తగా, అతీంద్రియ శక్తుల ముప్పును ఆపేందుకు సమయంతో పోరాడే పాత్రలో నటిస్తున్నారు. మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా, జయరామ్ కీలక పాత్రలో కనిపించనున్న ఈ చిత్రాన్ని బీవీఎస్ఎన్ ప్రసాద్, సుకుమార్ రైటింగ్స్ కలిసి నిర్మిస్తుండగా అజనీష్ లోకనాథ్ సంగీతం అందిస్తున్నారు.